


# మినీకథావీధి

## సెలక్షన్

పినిసెట్టి శ్రీనివాసరావు



"రండి-రండి. శాస్త్రులవారు....మీ కోసమే యెదురుచూస్తున్నాం."

"ఆ....వస్తున్నా-వస్తున్నా. ఏదండీ. ఒక్క గడపా? ఒక్క పనా? ఒక్క వూరా? దేశ దిమ్మరిలా నిత్యం తిరగడమే నా పని. ఏ క్షణాన్న యెక్కడుంటానో నాకే తెలీదు. "పరోపకారం-ఇదం శరీరం" అన్నట్టు మీ అందరి పనులు చేసి పెట్టడమే నా పని" అంటూ భుజంమీది కండువా ఒక్కసారి సరిచేసుకుని ప్రక్కనున్న సోఫామీద ఆసీనులయ్యారు శంకర శాస్త్రులవారు.

"ఊ!.... మీరుభయులూ కూడా కూర్చోండి. మూడు సంబంధాలు తెచ్చాను. అందులో మీ కేది నచ్చితే అది...."

"ఉండండుండండి. ఒక్క నిముషం. మీకు కాస్త కాఫీ పట్టుకొస్తాను." అంటూ వెళ్ళబోయారు సావిత్రమ్మగారు.

"ఇదిగో చూడమ్మా. కాఫీలు- టీలు ఈకాలపు వాళ్ళకి. నాకు కాస పల్చటి మజ్జిగ ఉంటే ఇప్పించమ్మా చాలు...." అన్నారు శాస్త్రులవారు.

"అలాగే" అంటూ లోపలికెళ్ళి, ఓ పెద్ద గ్లాసునిండా మజ్జిగ తెచ్చిచ్చారు సావిత్రమ్మగారు.

* * *

"మొదటి సంబంధం.... ఇదిగో కుర్రాడి ఈ ఫొటో చూడండి. అబ్బాయి లక్షణంగా వుంటాడు. ఒడ్డూ- పొడుగు. దబ్బపండు రంగు. సి. ఏ; అదే "చార్టెడ్ అకౌంటెన్సీ" చదివాడట. హైదరాబాద్‌లో ఓ కంపెనిలో ఆడిటరుగా పనిచేస్తున్నాడు. నెలకు పదిహేనువందలు జీతం. కుర్రాడి తండ్రి రిటైర్డు రైల్వే ఆఫీసరు. అతగాడు పోయి రెండేళ్ళయింది. విధవ తల్లి మాత్రం వుంది. మొత్తం సంతానం ఎనిమిది మంది. అందులో ఐదుగురు ఆడపిల్లలు. ముగ్గురు పెళ్ళిళ్ళయి అత్తారింటికి వెళ్ళిపోయారు మగపిల్లలో ఈ అబ్బాయే పెద్దవాడు. స్థిరాసి. చరాస్తులన్నీ కలిపి ఓ నాలుగులక్షల విలువచేస్తాయి. కట్నం-పాతిక- ముప్పై మధ్యనుంటుంది. రాజా లాంటి సంబంధం."

"రెండవ సంబంధం. ఇదిగోండి అబ్బాయి ఫొటో. అబ్బాయి కాస్త పొడుగు. హిందీ సినిమా హీరోలా ఉంటాడు. బొంబాయిలో ఉద్యోగం. ఎం. బి. ఏ చదివాడు. నెలకు రెండువేలు సంపాదిస్తున్నాడు. తల్లిదండ్రులిరువురూ వున్నారు. స్వస్థలం అమలాపురం. సంతానం ఐదుగురూ మగ పిల్లలే. భూములూ గట్రా వున్నాయి. కట్నం, ముప్పై - నలభై మధ్యన వుంటుంది. పిల్ల నచ్చితే కట్నం విషయంలో పెద్ద పట్టింపులేదట."

"ఇకపోతే యిది చూడండి. మూడవ సంబంధం అబ్బాయిది. అబ్బాయికాస్త ఛాయ తక్కువైనా కళగల ముఖం. బుద్ధిమంతుడు. ఎం.ఎ. చేసి విజయవాడలోనే కాలేజిలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులిరువురూ చనిపోయి చాలాకాలమే అయిందట. మేనమామ దగ్గరవుండి చదువుకున్నాడు. ఒక్కడే సంతానం. అబ్బాయి పేరన విజయవాడలోనే ఓ చిన్న యిల్లు వుందట. ఇంతకుమించి ఆస్తుల్లేవు. అబ్బాయి జీతం నెలకు వెయ్యదాకా వుండొచ్చు. ఏమైనా మొదటి రెండు సంబంధాలు చూస్తే, ఇదిమీకు అంతగా నచ్చకపోవచ్చు. కానీకట్నం ఆశ కొంచెం యెక్కువగానే వుందిలాగుంది. అంటే నలభై పైనే నన్నమాట"

"నేను మరో నాలుగురోజులుపోయాక వస్తాను. ఈలోగా మీరు ఏ సంసబంధం చూద్దామని నిర్ణయించుకుంటారో చెప్తే-మంచి రోజు చూసుకుని అక్కడికి వెళ్ళవద్దాము... మరి ఇక నే...."

"ఆఁ....ఇదిగోండి 'ఫీజు' విషయంలో లేటు చెయ్యరు శాస్త్రులవారు." అంటూ పాతిక రూపాయలు శంకరశాస్త్రివారికి ఇచ్చారు సావిత్రమ్మగారు.

"అమ్మా.... అన్నిటికీ రేట్లు పెంచేశారు. మా రేటు మాత్రం అలానే వుంది. మరో పాతిక ఇప్పించండి."

"శాస్త్రులవారు బేరం లేందే పుచ్చుకోరు."

"అవునుమరి. నా మీద యింత భారం మోపారు. బేరం లేకపోతే ఎలా చెప్పండి?"

మరో పాతికకూడా తీసుకుని వెళ్ళిపోయారు శంకరశాస్త్రివారు.

* * *

"ఏం ఆలోచించావు సావిత్రీ?" భార్యను అడిగారు సత్యనారాయణగారు.

"మూడో సంబంధం అన్ని విధాలా బాగుందనిపిస్తుందండీ."

"నీ సెలక్షన్ అదేనని నేను ముందే వూహించాను."

"ఎలాగ?"

"ఒకటి — అబ్బాయికి తల్లిదండ్రులు లేరు, అక్కచెల్లెళ్ళు లేరు. నువ్వు అంటుండే దానివికదూ! అత్తమామలు. ఆడబిడ్డల పోరు లేకుంటే పిల్ల సుఖపడుతుందని— అందుకే మిగతా ఇద్దరికంటే ఆస్తి. సంపాదన తక్కువైనా, కట్నం ఎక్కువైనా, నీ సెలక్షన్ ఇదే అవుతుందని ఊహించాను."

"అవునండీ.... ఎవరి పిల్లలు సుఖపడాలని ఎవరికుండదు?"

"కాదనను. మనకీ ఆరుగురుసంతానం. నలుగురు ఆడపిల్లలు. ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేస్తే, మన అబ్బాయిలకు తలా పాతిక వేలు మిగలవు. మరి అందరూ మనలాగానే ఆలోచిస్తే.... నువ్వూ నేనూ బ్రతికి

వున్నంత కాలం.... మన అబ్బాయిలకు మంచి సంబంధాలు దొరుకుతా...."

"ఛఛ.... అవేం మాటలండీ" అంటూ భర్త నోటిని తనచేత్తో మూసేసింది సావిత్రమ్మ.

---

# హృదయం

## గుత్తుల భాస్కరరావు



నీల పదో క్లాసు పాసె ఫ్రెష్‌గా కాలేజీలో అడుగు పెట్టేముందు—

తల్లి చేరదీసి 'అమ్మడూ' అంటూ ప్రారంభించి కొన్ని జాగ్రత్తలు చెప్పింది. బైట ఎదురయ్యే ప్రమాదాలు గుర్తించాలని హెచ్చరించింది. యింకా....

"కాలేజీ అంటేనే అదో కొత్త ప్రపంచం. ఆడపిల్లవు నీ పరిధి. పదతీతెలుసుకుని మసులుకోవాలి. మగపిల్లలతో ఎలా వేగుకొస్తావో! ఆ వెధవలు నిన్నటివరకూ టెన్త్ క్లాస్ నీతో కలిసి చదివి వుండొచ్చు. అప్పటికి వాళ్ళు నిక్కరుగాళ్ళే కావచ్చు. కాలేజీ అనేసరికి కొత్తగా కొమ్ములొస్తాయి. పాంట్లు తొడగడంతోటే పెద్ద హీరోలనుకుంటారు. ప్రతి ఆడపిల్ల వంక చెదచూపులు చూస్తారు. నీ హద్దుల్లో నువ్వుండాలి."

నీల అనుభవజ్ఞురాలిలా జవాబిచ్చింది: "నీకేం భయం లేదమ్మా. నా విషయంలో నిశ్చింతగా వుండు. నేను ఎవరివంకా చూడకపోతే — ఎవరో నా వంక చూస్తున్నారనే సమస్యేలేదు. నేను పట్టించుకోనమ్మా"

"భేష్ తల్లీ. చదువుమీదధ్యాసవుంచాలి. చదువు పూర్తయ్యేవరకూ మరో ధ్యాస వుండకూడదు. ప్రతి కుర్రాడు ముందు ప్రేమ ప్రేమ అంటాడు. పెన్ అడిగినంత తేలిగ్గా హృదయం అడుగుతాడు. పెన్ యిచ్చినా ఫర్వాలేదుగానీ హృదయం పదిలం అమ్మడూ" అంది.

"నువ్వు పాతకాలందానివే అమ్మా. పెన్ మాత్రం ఎందుకిస్తానమ్మా!"

తల్లి మెచ్చుకొని ముద్దుగా మెటికలు విరిచి కూతుర్ని మొదటిరోజు కాలేజీకి సాగనంపింది.

ఒక పూట గడిచింది.

నీల లంచ్‌కి యింటికి వచ్చింది.

"అమ్మా ఒకడు అడిగాడే" అంది నీల.

తల్లి కంగారుగా "ఏమడిగాడే!" అంది.

"మీ పెన్ చాలా బావుంది. నాకు అచ్చంగా యిచ్చేయండి అని అడిగాడు."

"నువ్వేమన్నావ్?"

"ఇది నా స్వార్జితం కాదు. నా తల్లిదండ్రులు కొని యిచ్చిన వస్తువు. ఈ పెన్ మీద నాకు ఎటువంటి హక్కూ లేదు. నేనింకా వాళ్ళమీద ఆధారపడి వున్నాను. కాబట్టి నా పెన్ ఆశించకండి. అన్నాను. వాడి మొహం వాడిపోయింది" అంది సంతోషంగా.

ఆ తల్లి పొంగిపోయింది.

"అయినా అంత చర్చ పెంచకూడదు తల్లీ. ముందే కట్ చెయ్యాలి" అంది.

నీల భోంచేసి మధ్యాహ్నం కాలేజీకి వెళ్ళింది.

సాయంత్రం కాలేజీ అయిపోయింది. ఉరుకులు, పరుగులమీద యింటికి వచ్చేసింది.

"అమ్మా. అమ్మా" అంది వగరుస్తూ.

"మళ్ళా ఏం విశేషం నీలా?"

"విశేషమే. నా కాలేజీ ఫస్ట్‌డేనే జరిగింది."

"ఏవిటే?"

"ఇంకో స్టూడెంట్ .... డిగ్రీవాడు.... అడిగాడమ్మా."

"పెన్ అడిగాడా."

"కాదు. హృదయం కావాలన్నాడు"

"ఏమన్నావ్?"

"సారీ నేను అమ్మానాన్నల బిడ్డను. నాకే నామీద అధికారంలేదు. వాళ్ళు చెప్పినట్టు నడుచుకోడమే నా విధి అన్నాను."

"చాలు చక్కగా గడ్డిపెట్టావు. నువ్ కాలేజీలో తేలిగ్గా నెగ్గుకొస్తావు నీలా" అంది తల్లి.

"అమ్మా.... అమ్మా"

"ఏవిటమ్మా!"

"అతను చాలా బావున్నాడమ్మా. వీధి మొగలో నిలబడ్డాడు. 'యిక్కడే వుండండి. మా అమ్మ పర్మిషన్ తీసుకొని వచ్చి మీకు హృదయం యిస్తా'నని మాట యిచ్చానే. నువ్ ఊఁ అనమ్మా."

---



### ఏడిస్తే.... ప్రెసిడెంట్!

1840 లో యు. ఎస్. అధ్యక్షుని ఎన్నిక కోసం జరిగిన అంతరంగిక సమావేశంలో హెర్రిసన్ ఎన్నికయ్యాడు. హెన్రీ క్లే ఓటమిని భరించలేక అతని మిత్రుడు జాన్ టేలర్ కన్నీళ్ళు పెట్టుకున్నాడు. దాంతో సమావేశం ఆయనను ఉపాధ్యక్షునిగా నియమించింది. ఆ తర్వాత నెలరోజులకు హెర్రిసన్ పదవిలో ఉండే పరమపదించాడు. టేలర్ అధ్యక్షుడయ్యాడు. ఏడిస్తే అదృష్టం వరిస్తుంది కాబోలు!!

---

# నిమ్మతొనలు!

పెళ్ళయిందనడానికి రుజువు

మెళ్ళో తాళి

కట్టకముందే అయ్యిందనుకుంటే

ఎగతాళి!

—'మాధవీ సనారా'